ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | 5

రోడ్ కం రైలు బ్రిడ్జిపై
కారు బీభత్సం 3
- రెండు బైక్‌లను ఢీకొన్న కారు..
- బ్రిడ్జి పైనుంచి పడి ఒకరి మృతి



పట్టభద్రమేనా!

నేటితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారానికి తెర

- ఎల్లుండే పోలింగ్
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- కూటమి శ్రేణులు ప్రచారం
- పేరాబత్తులకే అవకాశాలు
- బరిలో 35 మంది అభ్యర్థులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సమయం దగ్గరపడింది. మరో రెండు రోజుల్లోనే ఎన్నిక నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. పోలింగ్‌కు 48 గంటల్లోనే ప్రచారం ముగించాలనేది ఎన్నికల సంఘం నియమావళి. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్లు లెక్కిస్తారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,13,126 ఓట్లు ఉన్నాయి. బరిలో 35 మంది పోటీ పడుతున్నారు. ఈ నెల 27న జరగనున్న పోలింగ్‌లో 35 మంది ఉన్నారు. ఇందులో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్..పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులుకు మధ్య ప్రధాన పోటీ ఉండొచ్చేన వాదన ఉంది. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుమారుడు జీవీ సుందర్ కొన్ని ఓట్లు చీల్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ స్థానాన్ని గెలిపించుకోవాలనే లక్ష్యంతో అధికార కూటమి ఉంది. అధికారులు ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు.పోలింగ్ బ్యాలెట్ పత్రాలతో జరుగుతోంది. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ పత్రాల బాక్సులను. ఇతర ముఖ్య సామగ్రిని ఏలూరులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు.3వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. బ్యాలెట్ పత్రాల్లో మొదటి,రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి ఉన్నందున్న ఫలితం ఆలస్యమవుతుంది.

కూటమిలో గెలుపు ధీమా

కూటమిలో తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుస్తారనే ధీమా ఏర్పడింది. ఆయనను గెలిపించడానికి జిల్లాలోని కూటమి మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎంపీలతో పాటు మొత్తం కేడరంతా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికలు చాలా కీలకం అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.జిల్లా మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,టీడీపీ నేతలు బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన రాజమండ్రి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, జిల్లాలోని కూటమి క్యాడర్ ఒక్కలెక్కన పని చేస్తున్నారు.అధికార కూటమి అంతా ఒకే తాటిపై ఉండడంతో పేరాబత్తుల బలం పెరిగింది.దిడ్ల రాఘవులకు టీచర్ సంఘాలు ఉండడంతో పోటీ ఇవ్వగలుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందరూ మొదటి ప్రాధాన్యతా ఓటు కోసమే ప్రయత్నిస్తున్నారు.

బరిలో 35 మంది..

బరిలో 35 మంది అభ్యర్థులు ఉన్నారు. కాకినాడకు చెందిన పేరాబత్తుల రాజశేఖర్, కపిలేశ్వరపురం మండలం పడమర కండ్రికకు చెందిన దిడ్ల వీరరాఘవులు, కాట్రు నాగబాబు, షేక్ హేస్సేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం,కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమకుమారి, కైల లావణ్య, కొల్లు గౌతమ్‌బాబు, చిక్కాల దుర్గారావు,తాళ్లూరి రమేష్, నోరి దత్తాత్రేయ,యాళ్ల దొరబాబు,నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ,పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మన బోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నీరాజ్, బండారు రామమోహనరావు,చిక్క భీమేశ్వరరావు,మాకే దేవీవరప్రసాద్,మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్,రాజ పూడి, జేటీ రామారావు,రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివ గణేష్,విష్ణువఝల శ్రీనివాస్, ఎం.శ్రీనివాస రావు, జీవీ.సుందర్,హాసన్ షరీఫ్ పోటీలో ఉన్నారు.



నిన్నటి వరకూ ఒక లెక్క..!

నిన్నటి వరకూ ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క అంటున్నారు.. నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్న శ్రీ.. ఎందుకంటే ఎన్నో కష్టాల మధ్య చదువుకుని ఈ స్థాయికి ఎదిగారు.. పేద విద్యార్థులు కష్టాలు ఎలా ఉంటాయో ఆమెకు తెలియదా..వర్శిటీ హాస్టళ్లలో సరైన భోజనం ఉండదు.. కనీస సౌకర్యాలు ఉండవు.. నన్నయ వర్శిటీలో ఇవీ మరీ ఎక్కువ.. గతంలో ఈ విషయం చాలా సార్లు రుజువైంది కూడా.. వర్శిటీ హాస్టల్‌లో పెట్టే ఆహారం బాగోవడం లేదని విద్యార్థులు ఆందోళనలు చేసిన ఘటనలెన్నో.. దీనిపై అవగాహన ఉందో ఏమోకానీ.. వీసీ సోమవారం విద్యార్థులు.. విద్యార్థినుల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.. మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.. ఒక విద్యార్థినికి భోజనం తినిపించారు.. భోజనం బాగోలేక పోతే నాకు చెప్పండి అంటూ ధైర్యమిచ్చారు.. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా.. పుస్తకాలకు దగ్గరగా జీవించాలని సూచించారు. - దివాన్‌చెరువు



ఊహల పల్లకీలో.. ఊరేగించనా!?

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎవరికో..

- ఎన్నిక షెడ్యూల్ జారీ
- మార్చి 20న పోలింగ్.. ఫలితాలు
- ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ
- 29 వరకూ ఎమ్మెల్సీగా యనమల
- మళ్లీ పొడిగింపు లేనట్లే?
- జిల్లా నుంచి ఎవరికి దక్కేనో
- ముందువరుసలో వర్మ
- పవన్ కోసం సీటు త్యాగం
- తొలి ఎమ్మెల్సీకి బాబు హామీ
- జనసేన నుంచి నాగబాబు
- ఆశావహుల ప్రయత్నాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే నెల్లో ముగియనుండడంతో ఈ స్థానాలకు కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా సోమవారం షెడ్యూల్ జారీ అయింది. ఎమ్మెల్సీ పదవి కోసం అప్పుడే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఆశావహుల సందడి పెరిగింది. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతలు తెర వెనుక ప్రయత్నాలు ఆరంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ముగుస్తుండడంతో ఆయనకు పొడిగింపు ఛాన్స్ లేనట్లేనని పార్టీ ఇదివరకే సంకేతాలు పంపింది. దీంతో ఉమ్మడి జిల్లా కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన నుంచి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెడతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎవరిని వరిస్తాయో చూడాల్సిందే మరి.

యనమలకు ఛాన్స్ లేనట్లే..

తుని నుంచి మాజీ మంత్రి యనమల ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో ఈయనకు మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరిగింది. కానీ ఈసారి ప్రభుత్వంలో యువ నేతలకు ఛాన్స్ ఇవ్వాలన్న టీడీపీ సిద్ధాంతం నేపథ్యంలో సీనియర్ అయిన యనమలకు అమాత్య పదవి దూరమైంది. అయితే ఎమ్మెల్సీ పదవి ఎలాగూ ఉండడంతో పెద్దగా యనమలకు ఇబ్బంది రాలేదు. పైగా ఎన్నికల్లో యనమల కుటుంబానికి ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ సీట్లు పార్టీ కట్టబెట్టింది. దీంతో ఇప్పుడు యనమల తనయురాలు దివ్య తుని ఎమ్మెల్యేగా, అల్లుడు ఏలూరు ఎంపీగా ఉన్నారు. వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇలా యనమలతో కలిపి ఆయన కుటుంబానికి చెందిన మొత్తం నలుగురు వివిధ పదవుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం యనమలకు ఉన్న ఎమ్మెల్సీ పదవి మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. కానీ ఆయనకు తిరిగి ఈ పదవిని మళ్లీ కొనసాగించే అవకాశం లేదని పార్టీ ఇప్పటికే సంకేతాలు పంపింది. ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎమ్మెల్యేల బలం ప్రకారం కూటమికే దక్కనున్నాయి. వీటిలో టీడీపీ నాలుగు తీసుకుని, జనసేనకు ఒకటి కేటాయించే అవకాశం ఉంది.

నాడు పలువురి త్యాగం?

ఎన్నికల సమయంలో పిఠాపురం సీటును పవన్‌కల్యాణ్ కోసం మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగం చేశారు. బత్తుల బలరామకృష్ణ కోసం రాజానగరం సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న వాసంశెట్టి సుభాష్ కోసం రామచంద్రపురం సీటును రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న కందుల దుర్గేష్ కోసం నిడదవోలు సీటు బూరుగుపల్లి శేషారావు త్యాగం చేశారు. వీరిలో రాజానగరం సీటు త్యాగం చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరిని రుడా ఛైర్మన్‌గా నియమించింది. అంతేకాకుండా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ ర్యాంకు కట్టబెట్టింది. రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ పొలిట్ బ్యూరో హోదా ఇచ్చింది. ఇక వీరిలో మిగిలింది వర్మ, శేషారావు మాత్రమే. నాడు టిక్కెట్లు కోసం గట్టిగా ప్రయత్నించిన మరికొందరికి వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది.

ముందు వరుసలో వర్మ..

మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి ఎమ్మెల్సీ పదవుల్లో తొలి ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. యనమల స్థానంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని చంద్రబాబు ఎవరి ద్వారా భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. రేసులో పిఠాపురం వర్మ ముందువరుసలో ఉన్నట్టు సమాచారం. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా పిఠాపురం సీటును వర్మ త్యాగం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచి పోటీ చేయడంతో వర్మకు సీటు లేకుండా పోయింది. ఈనేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు అమరావతికి వర్మను పిలిపించి అధికారంలోకి రాగానే తొలి ఎమ్మెల్సీ పోస్టు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ పదవితో పాటు క్షత్రియుల కోటాలో మరింత గౌరవం కల్పిస్తానని పేర్కొన్నారు. అటు ఎన్నికల ప్రచారంలో పవన్ సైతం వర్మ లాంటి నేత చట్ట సభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు వర్మకు ఎమ్మెల్సీ పదవి కట్టబెడతారనే ప్రచారం జరుగుతోంది. వర్మ సైతం తనకు ఈ దఫా పదవి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

నాగబాబుకు ఇస్తే..

జనసేన నుంచి నాగబాబును ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తారనే చర్చ జరిగింది. దీనికి సంబంధించి కొంతకాలం కిందట కూటమి తరఫున అధికారిక ప్రకటన వచ్చింది. నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తే వర్మకు ఛాన్స్ ఉండదనే ప్రచారం కొంతకాలం కిందట జరిగింది. ఖాళీ అయిన ఐదు స్థానాల్లో ఒకటి జనసేనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఆ కోటాలో నాగబాబు ను భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. టీడీపీ ఖాతాలో ఉండే నాలుగింటిలో ఒకటి ఉమ్మడి జిల్లా కోటాలో వర్మకు ఇస్తారని, తద్వారా ఏ సమస్యా ఉండదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.


మా సంగతేంటి?

గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం ఆర్థికంగా, కేడర్ పరంగా వెన్నుదన్నుగా ఉన్నామని, ఎమ్మెల్సీ పదవితో తమను గౌరవించాలని కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు టీడీపీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఐదేళ్లలో పార్టీకి ఆర్థికంగాను, కేడర్‌పరంగాను చేసిన సేవలను వివరిస్తూ త్రుటిలో సీటు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవికి పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పార్టీ ఆశావహుల నియోజకవర్గాల్లో రహస్యంగా ఐవీఆర్ఎస్ సర్వే చేసినట్టు సమాచారం. ఆ సర్వే ప్రకారం పార్టీ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చి ఉంటుందని అంటున్నారు. కోనసీమ జిల్లా నుంచి ఓ మహిళా నేత తనకున్న పలుకుబడితో ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటు కమ్మ సామాజికవర్గం నుంచి సైతం కొందరు నేతలు పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 10న నామినేషన్ దాఖలు చేయడానికి ఆఖరిరోజు కావడంతో వచ్చే నెల మొదటివారంలోనే పదవుల కేటాయింపుపై స్పష్టత రానుంది.

కదిలించిన ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- రేపే మహా శివరాత్రి
- నిన్నటి వరకూ ఏర్పాట్లు లేవ్
- ఒక్క కథనంతో కదలిక
- చకచకా సాగుతున్న ఏర్పాట్లు
- గోదావరి ఘాట్లు కళకళ
- దగ్గరుండి రేవుల ముస్తాబు
- రాజమండ్రి, కొవ్వూరు ఇంతే



రేవులు శుభ్రంగా : రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌లో మెట్లపై మట్టి తొలగింపు.. నీటిలో చెత్త తరలిస్తున్న గోదావరి పరిరక్షణ సమితి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి ఏర్పాట్లపై అధికారులు కదిలారు.. ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో చకాచకా పనులు చేస్తు న్నారు. మహా శివరాత్రికి గోదావరి రేవులను ముస్తాబు చేస్తున్నారు. గోదారమ్మ ఎక్కడ.. శివయ్యా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు.. ఉదయం నుంచి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గోదావరిలో నీరు తగ్గడంతో మెట్లు పైకి తేలి కనిపిస్తుండడంతో స్నానాలకు అనువుగా తయారు చేస్తున్నారు. కోటిలింగాల రేవు,పుష్కరాల రేవులకు అత్యధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నీరు బాగా కిందకు వెళ్లిన చోట్ల షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి గోదావరి రేవులకు అనుసంధానంగా ఉన్న రహదారులను ఎంపిక చేశారు.



11 ఘాట్లలో ఇలా..

రాజమహేంద్రవరంలోని 11 స్నానాల ఘాట్లలో ప్రధానంగా పుష్కరాలరేవు, కోటి లింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, మార్కండేయ ఘాట్, టీటీడీ ఘాట్, శ్రద్ధానందా ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. ఈ రేవుల వద్ద ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పాటు శానిటేషన్ సెక్రటరీలు, 400 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. సిబ్బంది మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు విధు లు నిర్వహిస్తారు.ప్రతి 8 గంటలకు సిబ్బంది షిఫ్టులు మారేవిధంగా విధులు నిర్వహించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలిచ్చారు. పుష్కరాలరేవు, కోటిలింగాల రేవుల వద్ద రెండు అంబులెన్స్‌లు, ఐదు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు నగర పాలక సంస్థ ఏర్పాటు చేస్తుంది. రేవులను గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. మార్కండేయ ఘాట్‌లో సోమవారం ఉదయం సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి రేవులో చెత్తను తొలగించారు.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలపై నాచుపట్టి భక్తులు జారి పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధాన స్నానఘట్టంలోని మెట్లపై ఉన్న నాచుని ఐరన్ బ్రష్‌తో తొలగించారు. స్నానఘట్టాల్లో భక్తులు విడిచిన బట్టలు, ఇతర వస్తువులను తొలగించి శుభ్రం చేయించారు. మెట్లపై భక్తులు జారి పడకుండా స్నానఘట్టాల్లో ఇసుక, బ్లీచింగ్ వేయించారు.



పడిపోకుండా : కొవ్వూరులో మెట్లపై నాచు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పట్టిసంకు 25 బస్సులు

కొవ్వూరు : శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టిసీమ ఉత్సవాలకు కొవ్వూరు డిపో నుంచి 25 బస్సులను నడుపుతున్నట్టు డీఎం కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 26వ తేదీ తెల్లవారుజాము 2 గంటల నుంచి 27వ తేదీ తెల్లవారుజాము వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా పట్టిసీమ వరకు టిక్కెట్ ధర రూ.60లు నిర్ణయించామన్నారు.భక్తుల రద్దీని బట్టి బస్సులు పెంచే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

సీతానగరం,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ సూచించారు. సీతానగరం మండలం వంగలపూడి నుంచి పట్టిసీమకు వెళ్లేందుకు గోదావరికి అడ్డంగా వేసిన రహదారిని సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వంగలపూడి నుంచి పట్టిసీమ వెళ్లేందుకు దారి అనువుగా ఉందన్నారు.ఆయన వెంట సీఐ సత్యకిషోర్, ఎస్ఐ రామ్‌కుమార్, కార్యదర్శి సుజాత,కొంచ చంద్రభాస్కర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



అంతా ఓకేనా : వంగలపూడి టూ పట్టిసం రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ

హామీల అమలుకు 108 ఉద్యోగుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు అధ్యక్షతన ప్రభుత్వాధికారులతో జరిగిన చర్చల్లో 108 యూనియన్ ప్రతినిధులకు రాతపూర్వకంగా, మౌఖికంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూనియన్ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గతంలో జరిగిన చర్చల్లో ప్రభుత్వం కొన్ని డిమాండ్లు ఒప్పుకోవడంతో చర్చలు ఫలించి సమ్మె నోటీసును తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తమ డిమాండ్లను కొత్త యాజమాన్యం కోసం తయారు చేసే ఆర్ఎఫ్‌పీలో చేర్చుతామని, అవి అమలయ్యేలా చూస్తామని చెప్పడం జరిగిందన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం తయారు చేసిన ఆర్ఎఫ్‌పీలో తమకు ఇచ్చిన మినిట్స్‌లోని అంశాలు, మౌఖికంగా ఇచ్చిన హామీలు చేర్చలేదని వీటిని తక్షణమే అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. ఈమేరకు కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావులకు వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంయుక్త కార్యదర్శి రమేష్‌నాయుడు, జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.



108 ఉద్యోగుల నిరసన ప్రదర్శన


హర్యానా వర్సెస్ ఉత్తరాఖండ్ సెక్రటేరియట్


గోల్ కొడుతున్న ఆంధ్ర జట్టు కెప్టెన్



ఆంధ్ర సెక్రటేరియట్ వర్సెస్ మహారాష్ట్ర సెక్రటేరియట్





హాకీ చలాకీ

కాకినాడలో పదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు

పురుషులు, మహిళల విభాగాల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సోమవారం వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పోటీలను పర్యవేక్షించారు. పురుషుల విభాగంలో... ఆర్‌ఎస్బీ రాయపూర్, ఆర్‌ఎస్బీ జైపూర్ మధ్య మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ రాయపూర్ జట్టు 3-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 6-1 తేడాతో గెలుపొందింది. ఉత్తరాఖండ్ సెక్రటేరియట్, కర్నాటక సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌ను 3-1 తేడాతో ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ కైవసం చేసుకుంది. హిమాచల్‌ప్రదేశ్ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 4-2 తేడాతో విజయం సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 3-1 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... ఒడిశా సెక్రటేరియట్, తెలంగాణ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. హర్యానా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జరిగిన మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ జట్టు 3-0 తేడాతో గెలిచింది. బిహార్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ సెక్రటేరియట్ 7-2 తేడాతో విజయం సాధించింది.


కేరళ సెక్రటేరియట్ వర్సెస్ హర్యానా సెక్రటేరియట్


మ్యాచ్‌ను వీక్షిస్తున్న దృశ్యం

సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి



ఎ.శ్రీనివాస్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జి

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలతో అలసిపోయిన క్రీడాకారులకు వినోదంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రోగ్రామ్స్‌ను డిజైన్ చేశారు. వీటికి క్రీడాకారులతో పాటు స్థానికుల నుంచి మంచి స్పందన వస్తోంది. జాతీయ స్థాయి టోర్నీని మన కాకినాడలో నిర్వహించుకోవడం గర్వకారణంగా ఉంది. అందుకు తగ్గట్టుగానే ప్రోగ్రామ్స్ కూడా ఏర్పాటు చేశాం. కలెక్టర్ షాన్ మోహన్ ఆర్డీవోలను, హెచ్‌వోడీలను టోర్నమెంటులో ఇన్వాల్వ్ చేస్తూ టోర్నీని సక్సెస్ ఫుల్‌గా జరిపిస్తున్నారు.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి

క్రీడాకారుల అలవాట్లకు తగ్గట్టుగానే ఆతిథ్యం



కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సెట్రాజ్ సీఈవో

సివిల్ సర్వీసెస్ హాకీ నేషనల్ టోర్నమెంటుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను దృష్టిలో పెట్టుకున్నాము. నార్త్, సౌత్ క్రీడాకారుల ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా ఆతిథ్యం ఇస్తున్నాం. సాయంత్రం వేళ సాంస్కృతిక ప్రదర్శనలతో క్రీడాకారులు సేదతీరుతున్నారు. కలెక్టర్, జేసీలు ప్రోగ్రామ్‌ల కన్వీనర్లు, సభ్యులతో నిరంతరం మాట్లాడుతూ సమన్వయపరచడంతో టోర్నమెంటును సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించగలుగుతున్నాం.

కార్పొరేషన్ (కాకినాడ), ఆంధ్రజ్యోతి


ఇంజనీరింగ్ విద్యార్థి శ్రీధర్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

అమ్మ మనసును బాధ పెట్టకండి

నన్నయ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్ల జోలికి పోవద్దని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణం చేయండని తాను వీసీగా కాకుండా అమ్మలా చెప్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. పిల్లలకు జరగరానిది జరిగితే తల్లి మనసు విలవిలలాడిపోతుందని, అమ్మ మనసును బాధ పెట్టవద్దని కోరారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఈసీఈ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది మృతి చెందాడు. అతడి పేరిట శ్రీకాంత్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ... తాను పెద్ద కుమారుడు తేజ్‌నయన్‌ను 1989లో, చిన్న కుమారుడు సిద్ధార్థ్‌ను 2010లో పోగొట్టుకున్నానన్నారు. ఇద్దరు పిల్లలనూ దూరం చేసిన దేవుడు తనకు ఇప్పుడు ఇంతమంది పిల్లలను ఇచ్చాడన్నారు. ఒక బిడ్డను పోగొట్టుకుంటే అమ్మ మనసు ఎంత బాధపడుతుందో తనకు తెలుసన్నారు. మీరంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలని కోరారు. తాను వీసీగా కాకుండా మీ అందరికీ అమ్మలా వచ్చానని చెప్పారు. ఏ పని చేసినా కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, అప్పుడే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.సుధాకిరణ్, బి.కృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రసన్నశ్రీ


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.34 కోట్లు

బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ఎస్వీఎస్వీ ప్రసాదరాజు, టీవీఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం తెరిచి లెక్కించారు. 31 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,09,68,428, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.21,50,593... మొత్తం రూ.1,34,01,911 ఆదాయం లభించింది. బంగారం 30 గ్రాములు, వెండి కిలో, 34 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,82,890 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో అర్చకస్వాములు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కనుల పండువగా కుక్కుటేశుని కల్యాణం

పిఠాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. ఆస్థాన వేద పండితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠీ, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార్య బ్రహ్మత్వంలో, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచిన అనంతరం మాంగల్యధారణ జరిగింది. అర్చకులు పోటీపడుతూ స్వామి, అమ్మవార్లపై తలంబ్రాలు వేశారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

సామర్లకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమార రామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణం సోమవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టణ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి పదకొండు గంటలకు కల్యాణ తంతును ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాల శర్మ, సన్నిధిరాజు వెంకన్నబాబు, కొంతేటి భీమేశ్వర శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం తరఫున కార్యనిర్వహణాధికారి సుబ్బారావు దంపతులు స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలను సమర్పించారు. కల్యాణ ప్రక్రియను తణుకుకు చెందిన పండితుడు శర్మ చక్కగా వివరించారు. గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, భక్తులు


భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు


భారీ క్రేన్‌తో చెట్టును నాటుతున్న దృశ్యం

90 ఏళ్ల రావిచెట్టుకు పునరుజ్జీవం

90 ఏళ్ల వయసు కలిగిన రావిచెట్టును రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో పునరుజ్జీవింపజేశారు. ఈ చెట్టును వాహనంపై తీసుకొచ్చి భారీ క్రేన్ సహాయంతో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పెద్ద గొయ్యి తీసి సోమవారం నాటారు. రాజమహేంద్రవరంలోని కోర్టుల సముదాయంలో భవనాల నిర్మాణంలో భాగంగా తొలగించిన ఈ రావిచెట్టును రోటరీ ఐకాన్స్ ప్రతినిధులు గుర్తించి ఇక్కడకు తెచ్చారు. తొలుత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (అడ్మిన్), ఎల్.అర్జున్ (క్రైమ్స్), చెంచిరెడ్డి (ఏఆర్), ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



విస్తృతంగా చికెన్ మేళాలు

- బర్డ్‌ఫ్లూ లేదన్న అధికారుల సూచనలతో వెంకోబ్, హేచరీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- పిఠాపురంలో చికెన్ పకోడి, గుడ్లు పంపిణీ
- కొత్తపల్లి, తునిల్లో చికెన్‌తో భోజనాలు


కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా క్యూలో పాల్గొన్న ప్రజలు

పిఠాపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సోమవారం సాయంత్రం చికెన్ అండ్ ఎగ్‌మేళా నిర్వహించారు. వెంకోబ్ చికెన్ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్ పకోడి, ఉడకపెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. వీటి కోసం ప్రజలు భారీగా తరలివచ్చారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్, గుడ్లపై ప్రజల్లో నెలకొన్న అపోహను తొలగించేందుకు ఈ మేళా నిర్వహించారు. ఉడకపెట్టి వండిన చికెన్, గుడ్ల వల్ల ఏ విధమైన ఇబ్బంది ఉండదని ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ మేళా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో..

కొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉప్పాడకు చెందిన చికెన్ వ్యాపారస్తులు సోమవారం బీచ్‌రోడ్డు సెంటర్‌లో చికెన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 200 కిలోల చికెన్ తయారుచేశారు. 2వేల గుడ్లను ఉడకపెట్టారు. చికెన్, ఎగ్‌లను భుజించేందుకు తీర ప్రాంతాలకు చెందిన ప్రజలతోపాటు ఉప్పాడనుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లే ప్రయాణికులు క్యూకట్టారు. ఈ సందర్భంగా వెమ్‌కోబ్ చికెన్ ఉత్పత్తిదారులు మాట్లాడుతూ చికెన్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదని జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకే పలుచోట్ల చికెన్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు.

తుని పట్టణంలో..

తుని రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తునిలో రెండుచోట్ల చికెన్, కోడిగుడ్లతో ఉచితంగా విందు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. తుని పట్టణంలో సీఎంఆర్ సెంటర్‌తోపాటు అన్న క్యాంటీన్ పక్కన చికెన్‌తో ఉచిత భోజనాల శిబిరంవద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా వెంకటేశ్వర హేచరీస్ నిర్వాహకులు మాట్లాడుతూ చికెన్, గుడ్లు కొనుగోలులో ప్రజల్లో అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తలపెడుతున్నామని తెలిపారు.



పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో చికెన్‌మేళాకు తరలివచ్చిన ప్రజలు

కోడిగుడ్డు ధర.. కిందకు..



- బర్డ్‌ఫ్లూ ప్రభావంతో తగ్గిన గుడ్డు రేటు
- రూ.6.60 పైసల నుంచి రూ.4కి చేరిన ధర

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర కిందకు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఎక్కడికక్కడ కోడిగుడ్డు వాడకం తగ్గింది. దీంతో గుడ్డు ధర అమాంతంగా తగ్గిపోయింది. నెలరోజుల కిందట వరకు గుడ్డు రేటు రూ.6నుంచి రూ.6.50వరకు పలికేది. ప్రస్తుతం రూ.4 పలుకుతోంది. కోళ్ల ఫారాల్లో కూడా గుడ్ల ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో ఫారం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు లాభాలు చూసిన వాళ్లంతా నష్టాలు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు నష్టాలు ఎక్కువై ఫారం ఉంచాలా తీసేయాలా అన్నస్థితిలో ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 20లక్షల కోళ్లు ఉండగా ఉమ్మడి జిల్లాలో కోటి20 లక్షలు ఉన్నాయి. వాటి మీదే నిర్వాహకులు బతుకు జీవనం సాగిస్తున్నారు. ఈ వైరస్ వల్ల గుడ్లు రేటు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఒక్క గుడ్డు తయారు కావడానికి రూ.5 వరకు ఖర్చవుతుందని, కానీ రేటు మాత్రం రూ.4 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు


ఎస్పీ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

అన్నవరం దేవస్థానం టెండర్ ప్రకటనలో కాలపరిమితిగా భావించాలి: ఈవో

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానానికి సంబంధించి ఆంధ్రజ్యోతిలో సోమవారం ఇచ్చిన టెండర్ ప్రకటనలోని వివరాల్లో మొదటి వరుసలో ఉన్న షెడ్యూల్ ఖరీదు స్థానంలో కాలపరిమితి అని భావించాలని దేవస్థానంఈవో వీర్ల సుబ్బారావు కోరారు. ఆసక్తి కలిగి టెండర్‌కం ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనేగుత్తేదారులు ఈవిషయాన్ని గమనించాలన్నారు.

‘అన్నవరం’లో సమూల మార్పులు


భక్తుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

- అన్నవరంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటన
- భక్తులనుంచి అభిప్రాయాల సేకరణ
- అన్నదానంలో భక్తులు వేచి ఉండకుండా సిట్టింగ్‌తోపాటు బఫే విధానం
- గదుల కేటాయింపునకు ఇకపై నగదు రహిత విధానం అమలు
- ఈవో, చైర్మన్, సిబ్బందితో సమీక్ష
- ఇకపై ప్రతినెలా సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు సంతృప్తికరమైన సేవలందుతున్నాయా లేదా అనేదానిపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం చివరి స్థానం రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ సోమవారం స్వయంగా రంగంలోకి దిగి భక్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన క్యూలైన్ ద్వారా దర్శనానికి విచ్చేసిన భక్తుల ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారినుంచి సంతృప్తికరమైన జవాబు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి

పశ్చిమ రాజగోపురంవద్ద మహిళా భక్తురాలు సత్రం గదులు తీసుకునే సమయంలో కేవలం నగదు లావాదేవీలు మాత్రమే జరుపుతున్నారని, డిజిటల్ పేమెంట్‌లు లేవని తెలపడంతో సత్వరమే నగదు రహిత సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు గంట సమయం క్యూలైన్‌లో వేచిఉన్నామని కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఒక హాలులో కేవలం 425మంది కూర్చుని తినేందుకు మాత్రమే అవకాశం ఉందని తెలపడంతో పై అంతస్తులో బఫే విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించి వృథాగా పడిఉన్న సామాన్లను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదన్నారు. నిరుపయోగ సామానంతా ఒకచోట స్టోర్స్‌కు చేర్చుకోవాలని, మరుగుదొడ్ల నిర్వహణ తదితర ఫొటోలు తనకు ప్రతిరోజూ సాయంత్రం వాట్సాప్‌లో పంపించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ఆదివారం రాత్రి 9గంటలకు విచ్చేసిన భక్తురాలికి గదులు ఖాళీ లేవని చెప్పడంతో సీఆర్వో కార్యాలయంలో ఆదివారం రాత్రికి జరిగిన గదుల బుకింగ్‌ను పరిశీలించారు.

‘అభివృద్ధి కంటికి కనిపించాలి..’

అనంతరం ఈవో ఈర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, అన్నివిభాగాల సూపరింటెండెంట్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పలుచోట్ల నేమ్‌బోర్డులు పూర్తిస్థాయిలో కనిపించలేదని ప్రధానంగా జల ప్రసాదం కేంద్రాలవద్ద అక్షరాలు క్లారిటీగా లేవని ప్రతిచోట పరిశీలించి సరిచేయాలని ఈవోకు సూచించారు. ప్రసాదం విక్రయ కేంద్రాల్లో సిబ్బంది గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలని ఆదేశించారు. తల్లులు పిల్లలకు పాలిచ్చే కేంద్రం ఎప్పుడూ తెరిచి ఉంచడంతోపాటు మహిళా ఉద్యోగిని అక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెలా ఒకసారి రివ్యూ చేస్తామని మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధి కంటికి కనిపించాలని కాగితాలకు పరిమితం కాకూడదన్నారు. వచ్చేనెల రివ్యూలో దేవస్థానం భూములు, స్థలాల ఆక్రమణలపై చర్చిస్తానన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానం రావడం బాధనిపించిందన్నారు. సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సత్రంగదుల ఖాళీల వివరాలు చెప్పడంలో కౌంటర్ సిబ్బందినుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అత్యాచారం కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు

శిక్షతోపాటు రూ.5వేల జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడిపై అభియోగాలు రుజువు కావడంతో కోర్టు జైలుశిక్ష విధించింది. రాజమహేంద్రవరంలోని ప్రకాశంనగర్ సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలా చెరువుకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించాడు. పలుమార్లు శారీరక వాంఛ తీర్చుకున్నాడు. వివాహం చేసుకోవాలని ఆమె కోరగా తిరస్కరించాడు. దీనిపై ఆమె ఫిర్యాదుతో 2023, మే 20న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి, మహిళలపై నేరాల విచారణ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వై.వెన్నయ్య నాయుడు సోమవారం తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు, సీఐలు బాజీలాల్, పీఈ పవన్ కుమార్ రెడ్డి, పీసీ రమేశ్‌ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఉరేసుకుని మృతి చెందిన వ్యక్తి

గండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో పోలవరంగట్టున గుర్తు తెలియని వ్యక్తి సోమవారం చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 35-40ఏళ్ల వయస్సులోపు ఉండి నీలం, పసుపు, నలుపు రంగుల పొడుగు చేతుల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్ కలిగి ఉన్నాడన్నారు. ఆ చెట్టుపక్కనే సైకిల్ పడిఉందన్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిస్తే జగ్గంపేట సీఐ శ్రీనివాస్ 9440796529, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు 9440904841 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలునుంచి జారిపడి..

సామర్లకోట,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో వేట్లపాలెం-జి.మేడపాడు రైల్వేట్రాక్‌పై సోమవారం 35ఏళ్ల వయస్సుగల పురుష మృతదేహాన్ని రైల్వేపోలీసులు కనుగొన్నారు. రైల్వే కీమెన్ అందించిన సమాచారంతో వారు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. గుర్తుతెలియని రైలు ఢీకొనడం లేదా రైలునుంచి జారిపడడం జరిగి ఉంటుందనిపోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కుడిచేతి ఎల్బోపై ఈశ్వరి అని తెలుగులో రాసిఉందని, కుటుంబసభ్యులు ఉంటే తమను సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ ఆటోనుంచి జారి పడి..

నాలుగేళ్ల బాలుడి మృతి

- కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన
- పెళ్లింట విషాదం


పవన్‌శ్రీనివాస్(పాత చిత్రం)

పి.గన్నవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బాబాయ్ పెళ్లికి వచ్చిన ఆ బాలుడిని ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఆ బాలుడు మృతి.. పెళ్లింట విషాదం మిగిల్చింది. కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై ప్రమాదవశాత్తూ ఆటోనుంచి పడిపోయి నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి శివనాగేంద్ర కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు.ఈక్రమంలో వచ్చేనెల 1న తమ్ముడు వివాహం కావడంతో ముందుగా భార్య, పిల్లలు సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం ఆదిమూలంవారిపాలెంనుంచి శివనాగేంద్ర కుమారుడు పవన్ శ్రీనివాస్(4) తన బాబాయ్(వరసకు) సాయంతో లోడు ఆటోలో రాజోలుమండలం శివకోడు బంధువుల ఇంటికి వెళ్లాడు. శివకోడునుంచి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్నవరం అక్విడెక్టు వద్దకు వచ్చేసరికి ఆటో డోర్ ఊడిపోవడంతో ముందు కూర్చున్న చిన్నారి రోడ్డుపై పడిపోయాడు. దీంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా బలమైన గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచనతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్‌శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి తండ్రి శివనాగేంద్ర, తల్లి స్వర్ణ, సోదరుడు రోహిత్ ఉన్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని ఆ కుటుంబం రోదిస్తున్న తీరు కంటనీరు పెట్టిస్తోంది.

పాఠశాల భవనం పైనుంచి దూకేసిన విద్యార్థిని

- తండ్రి మందలించడమే కారణమంటున్న సహచర విద్యార్థినులు
- మండపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఘటన
- చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు

మండపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడన్న కోపంతో మండపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థిని పాఠశాల భవనంపైనుంచి కిందకు దూకేసిన సంఘటన ఇది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఇంటర్వెల్ సమయంలో దూకేసి..

మండపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోని ప్రభుత్వ బాలికల హైస్కూల్లో మహ్మద్‌ఫౌజీ (14) ఆరో తరగతి చదవుతోంది. సోమవారం ఆమెను తండ్రి ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువచ్చి బయట మందలించి కొట్టి లోపల అప్పగించాడు. తండ్రి కొట్టి.. తిట్టడంతో మనస్తాపానికి గురైన ఆమె తరగతిగదిలో సహచర విద్యార్థినులతో జరిగిన సంఘటన చెప్పి బాధపడింది. తన తండ్రి తనను మందలించాడని తాను పాఠశాల భవనంపైనుంచి దూకేస్తానని చెప్పింది. ఈ విషయం బయటకు రాకముందే ఆమె పాఠశాల ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చి పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేసింది. ఆమెను తక్షణమే వైద్యచికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ విద్యార్థిని కోలుకుంటోందని సమాచారం అందిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులకు ఏమైనా ఫిర్యాదు వచ్చిందా అని ప్రశ్నించగా తమ దృష్టికి ఆస్పత్రినుంచి సమాచారం వచ్చిందని వారు బదులిచ్చారు.

వృద్ధురాలిపై దాడి కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై దాడికి పాల్పడడమే కాకుండా ఆమె నగలు, నగదు తస్కరించిన కేసులో కాకినాడ పోలీసులు సోమవారం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.

ఇంట్లో ఒంటరిగా ఉండగా..

కాకినాడ జగన్నాథపురం యానాం రోడ్డులోని ఒంటరిగా నివసిస్తున్న తనను ఈనెల 14న రాత్రి 9 గంటల సమయంలో నలుగురు అగంతకులు దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించి తన కాళ్లు, చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి, ఇష్టానుసారంగా తనను శారీరకంగా హింసించి ట్రంకు పెట్టెలో ఉన్న బంగారపు ఉంగరం, బంగారపు గాజు, రూ.60వేల నగదును అపహరించుకుపోయినట్లు బాధితరాలు 74ఏళ్ల చాగంటి శుక్రవారపు మహాలక్ష్మి కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశానుసారం, కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ వి.కృష్ణ, వన్‌టౌన్ లాఅండ్‌ఆర్డర్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన చాగంటి రజిత అలియాస్ దారా రజిత అలియాస్ సిరి అదే ప్రాంతానికి చెందిన దారా రఘు, కరీంనగర్‌కు చెందిన తోందిర్తి లత అలియాస్ హేమలత, అదే ప్రాంతానికి చెందిన తాటి వెంకటేష్‌లను అరెస్ట్ చేసి 6.50 గ్రాముల గంగారపు గాజు, 2.70 గ్రాముల బంగారపు ఉంగరం, రూ.30వేల నగదును పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం, నిందితులకు సహకారం అందించిన ఫిర్యాది మహాలక్ష్మి ఇంట్లోని పనిమనిషి కాకినాడ జగన్నాథపురానికి చెందిన రామలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు.

వరుసకు కోడలే ప్రధాన నిందితురాలు

శుక్రవారపు మహాలక్ష్మి, శ్రీరామచంద్రమూర్తి దంపతులకు సంతానం లేకపోవడంతో శంకర్ అనే బాలుడిని దత్తత తీసుకుని పెంచుకున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. అతడు పెద్దయ్యాక ఉద్యోగ రీత్యా తెలంగాణకు వెళ్లి అక్కడ రజితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మహాలక్ష్మి ఒంటరిగా ఉండడంతో ఆమెలో దుర్బుద్ధి పుట్టింది. పనిమనిషితోపాటు తన కుటుంబసభ్యుల సహకారంతో రజిత ఈనీచానికి ఒడిగట్టినట్లు ఎస్‌డీపీవో తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని చోరీసొత్తును స్వాధీనం చేసుకున్న సీఐలు కృష్ణ, నాగదుర్గారావ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వినయప్రతాప్, పీసీ స్వామినాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోటకు వెళ్లాల్సిన దారుల్లో వాహనాల రూట్ల మార్పు

సామర్లకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాల ట్రాఫిక్‌ను వేరే రూట్లలో మళ్లించేలా తాత్కాలిక మార్పులు చేపట్టినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకూ మార్పు చేసిన ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. రాజానగరం నుంచి కాకినాడ వెళ్లే భారీవాహనాలు కత్తిపూడి నుంచి అచ్చంపేట జంక్షన్ మార్గంలో కాకినాడ వెళ్లాల్సిఉంది. రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లే లైట్ వెహికల్స్, ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే ఈ మార్గం వైపు పంపుతారు.

కాకినాడ-రాజానగరం మార్గంలో..

కాకినాడ నుంచి రాజానగరం మార్గం వైపు వెళ్లే భారీవాహనాలు కాకినాడ, అచ్చంపేట, కత్తిపూడి మీదుగా రాజానగరం వెళ్లాల్సి ఉంటుంది. కాకినాడనుంచి రాజానగరం వెళ్లే లైట్ వెహికల్స్, పాసింజర్ ఆటోలు, ఆర్టీసీ బస్సులు మాత్రమే సామర్లకోట,పెద్దాపురం వైపునుంచి పంపుతారు.

ద్వారపూడి-సామర్లకోట మార్గంలో..

ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలునుంచి సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్లాల్సిన భారీ వాహనాలు సామర్లకోట ఫ్లైఓవర్‌బ్రిడ్జి మీదుగా సామర్లకోట రైల్వేస్టేషన్, పిఠాపురం రోడ్డు నుంచి కాకినాడ మార్గం వైపు పంపుతారు.

పెద్దాపురం-కాకినాడ మార్గంలో..

పెద్దాపురం నుంచి కాకినాడ వెళ్లే భారీ వాహనాలు కూడా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం నుంచి బ్రౌన్‌పేట మీదుగా పిఠాపురం మీదుగా వెళ్లాల్సిఉంది. వాహనదారులు, ప్రయాణికులు పోలీసు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని సీఐ కృష్ణభగవాన్ కోరారు. ఈ సందర్భంగా సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు కూడా పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్: పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలని, బాధితులకు తగు పరిహారం అందాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వివిధ చిట్‌ఫండ్ సంస్థలు, ఏపీఈపీడీసీఎల్, బ్యాంక్‌ల ప్రతినిధులు, ఆయా సంస్థల న్యాయవాదులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్న ఇద్దరు యువకులను కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవులోని నందిరేవు సంతమార్కెట్‌కు చెందిన పోతాబత్తుల ఏసురాజు ఈనెల 18న ఓ వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో బంగారం చైన్, నల్లపూసల తాడును లాక్కుని అపహరించుకుపోయాడు. పోలీసులు నిందితుడిని పట్టుకుని 2.5కాసులు బంగారం రికవరీ చేశారు. కాకినాడ రూరల్‌కు చెందిన బొడ్డు అంజిబాబు కోరింగ యల్లమ్మగుడి వద్ద హుండీని దొంగిలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితులనుంచి వస్తువులను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

28 వరకూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

కలెక్టర్ ప్రశాంతి.. పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 28 వరకూ ఆర్థిక అక్షరాస్యత వారం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, జేసీ చిన్నరాముడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఆర్థిక సంస్కరణల అమలు తీరును గమనిస్తామన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజల ఆర్థిక స్థితిని మెరుగు పరచడం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత రిజర్వు బ్యాంకు 2016 నుంచీ నిర్వహిస్తోందని, ఈ ఏడాది 'ఆర్థిక అక్షరాస్యత-మహిళల శ్రేయస్సు'ను థీమ్‌గా ఎంపిక చేశారని చెప్పారు. ఈ వారోత్సవాల్లో భాగంగా రిస్క్ డైవర్సిఫికేషన్, రుణాలు తీసుకోవడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, మంచి కెడిట్ స్కోర్, గృహ బడ్జెట్‌ని నిర్వహించడం వంటి అంశాలపై చైతన్యం చేయడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.

కేవీకే నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ సమారోహం

పలువురు రైతులకు సత్కారం


కార్యక్రమంలో రైతులను సత్కరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం పీఎం కిసాన్ సమ్మాన్ పథకం 19వ వాయిదాను సోమవారం విడుదల చేశారు. దానిని జిల్లాలో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం నుంచి 150 మంది వెబ్‌క్యాస్ట్‌ను వీక్షించారు. జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ- కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేసింది. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా 22వేల కోట్లు పీఎం కిసాన్ 19వ వాయిదా రూపంలో 9.8 కోట్ల మంది రైతులకు బీహార్‌లోని భాగల్పూర్ నుంచి విడుదల చేశారు. దీనిని వెబ్ క్యాస్ట్ ద్వారా రైతులు తిలకించారు. రైతులతో పాటు జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్, కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకే అధికారులు జేవీఆర్ సత్యవాణి, బి.నాగేశ్వర్‌రెడ్డి, సంజయ్ వినాయక్ హెగ్డే, రంఘునందన్, రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషుమాధవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ సంస్థ పేరున కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ నుంచి జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థగా మార్చిందన్నారు. ఈ మార్పులో భాగంగా పొగాకుతో పాటు అశ్వగంధ, మిరప, పసుపు, ఆముదం పంటలపై కూడా పరిశోధన జరపాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తమ ఆధ్వర్యంలో ఉన్న రెండు కృషి విజ్ఞాన కేంద్రాలు (కలవచర్ల, కందుకూరు) సేవలను వినియోగించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలువురు రైతులను సత్కరించారు.

మల్లేశ్వరుడి ఆలయంలో పాంచాహ్నిక కల్యాణోత్సవాలు


మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి

కడియం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో పాంచాహ్నిక కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం లక్షపత్రిపూజ, రుద్రహోమం నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 27 వరకు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకడు అప్పలి శ్రీమన్నారాయణ, ఈవో కేవీవీ రమణ తెలిపారు. అలాగే కడియపులంకలో శ్రీఆంజనేయస్వామి 75వ వార్షికోత్సవం (వజ్రోత్సవ) ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సప్త నదీ జలాలతో 108 కలశాలతో హనుమాన్ విజయయాత్ర నిర్వహించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇదిలా ఉండగా కడియంలోని మల్లేశ్వరస్వామి, కడియపులంకలో ఆంజనేయస్వామిలను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు, అర్చకులు, నర్సరీ రైతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు వెలుగుబంటి ప్రసాదు, బొర్సు సుబ్రహణ్యం, ఆకుల శ్రీధర్, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రవి, పంతం గణపతి, ముద్రగడ జమీ, బోడపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వంగా రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. మహా శివరాత్రి రోజున స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకం జరుపుతామన్నారు. భక్తులు దీపాలు వెలిగించడానికి ఆలయం ముందు అరప ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కొంకుదురు త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం, ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీనివాసుడి ఆలయానికి ఉత్సవ విగ్రహాలు బహూకరణ

బిక్కవోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు పార్కు వీధిలో వున్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి పంచలోహ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం దాతలు బహూకరించారు. వీటిని గ్రామానికి చెందిన బేరా గోవిందు లక్ష్మణకుమారి, కునుకు కృష్ణ వెంకటరమణమ్మ దంపతులు 82 కిలోలతో చేయించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం జరిపి అనంతరం ఆలయంలో అభిషేకాలు, కల్యాణం జరిపించి అర్చకులకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, బేరా శ్రీను, దాసరి నూకరాజు, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాతలు

వైభవంగా విశ్వేశ్వరస్వామివారి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వరస్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పవిత్ర ఏకాదశి సందర్భంగా కోరుకొండ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. రెంటాల రమణమూర్తి దంపతులు,కాళ్ళకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, గాంధీ శర్మల ఆధ్వర్యంలో దైవ ఆగమంప్రకారం స్వామి వారి కల్యాణమహోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జాజుల రాము, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు, స్వామి వారి కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రికిముందుగా వచ్చే ఏకాదశి రోజున అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి కల్యాణమహోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

నే డు ఉమా కల్యాణం : కోరుకొండ మండలం జంబుపట్నం ఉమాసమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణానికి ముందు స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకుసాగాలి

అనపర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత గ్రామాల సాధనే లక్ష్యంగా ప్రతి వైద్య ఉద్యోగి కృషి చేయాలని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సునీతాదేవి అన్నారు. సోమవారం రామవరంలో టీబీ రహిత గ్రామాలే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి టీబీ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు పలు అంశాలపై శిక్షణ

సీతానగరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ నిర్వహిస్తున్నారు. సోమవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్‌లో ఆరురోజుల శిక్షణలో భాగంగా సోమవారం కోర్స్ కోఆర్డినేటర్, ఎంఈఓ కె.స్వామినాయక్ పర్యవేక్షణలో డీఆర్పీలుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు కెవెల్ మనోహర్, బేగం, వెంకటేశ్వరరావు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, భారతి అంగన్‌వాడీ వర్కర్లకు అంగన్‌వాడి సెంటర్లలో అమలు కావలసిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పేరాబత్తులకు తొలి ప్రాధాన్యత ఓటెయ్యండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


ఓటర్లను కలిసి కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 42వ డివిజన్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి కరపత్రాలు అందించారు. రాజశేఖరం విజయానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక లూథరన్ హైస్కూల్, డీఎంహెచ్ స్కూల్, చున్నిలాల్ జాజు హైస్కూల్, మునిసిపల్ టౌన్ హైస్కూళ్లలో సోమవారం పర్యటించి ఉపాధ్యాయులను కలిశారు. రాజశేఖరంను గెలిపించాలని టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దారా యేసురత్నం కోరారు. కాపునాడు కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, పరిశీలకులు బత్తుల తాతబాబు, బొల్లా వెంకట కృష్ణప్రసాద్, నాయకులు బుడ్డిగ గోపాలకృష్ణ, బత్తుల కిరణ్‌బాబు, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ మల్లవరపు అభ్యర్థన

ఎమ్మెల్సీ అభ్యర్థులు తమ ఆవేదన పట్టించుకోవాలని గెస్ట్ లెక్చరర్స్ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరంలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శంకర్రావు సమస్యలను విన్నవించారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో కీలకంగా ఉన్న గెస్ట్ లెక్చరర్లు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, తాత్కాలిక నియమాల వల్ల గెస్ట్ లెక్చరర్ల భవిష్యతుపై అనిశ్చితి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు వ్యాపార సంస్థలకు సెలవు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున వ్యాపారులంతా తమ తమ షాపులు మూసివేయాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో దంత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం డెంటల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ సెమినార్ హాలులో జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ, కళాశాల మైక్రో బయాలజీ డిపార్టుమెంట్ సహకారంతో నిర్వహించిన ఈ డెంటల్ క్యాంపులో పలువురు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది దంత పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ పీ.శామ్యూల్, పీజీ ఇంటర్న్స్ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, హెచ్ఓడీలు డాక్టర్ అనుపమ, డాక్టర్ హరికృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగలకు రూ.3 వేల చొప్పున జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ముగ్గురు దొంగలకు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథం తెలిపారు. మోరంపూడిలోని సురేశ్ చౌదరికి చెందిన వీఎస్ గ్రానైట్స్‌లో 2018లో చోరీ జరిగింది. కారు, ల్యాప్‌టాప్ దొంగిలించారు. పోలీసుల దర్యాప్తులో సీటీఆర్ఐకి చెందిన టి.సాయిభార్గవ్, లాలాచెరువుకు చెందిన జి.సునీల్ కుమార్, ఘంటసాల చిరంజీవిలను నిందితులుగా గుర్తించారు. నేరం రుజువు కావడంతో నేరస్తులకు 6వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ రెడ్డి ప్రసన్న రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు 'ప్రైవేట్'కు ఇవ్వొద్దు

తాటిపాక మధు.. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య పనులు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఆ బాధ్యత మునిసిపల్ శాఖ తీసుకోవాలన్నారు. మునిసిపల్ కార్మికులకు కనీస వేతనాలు రూ.35 వేలు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.త్రిమూర్తులు, యూనియన్ అధికారప్రతినిధి ధనాల దుర్గమ్మ, బంగారు గిరిబాబు, గుడుపు గిరి,నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌ను ఉడికించి తినొచ్చు

టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోరంట్ల


చికెన్ ఫ్రై, గుడ్డులతో ఆహారం వడ్డిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కోళ్లకు సోకిన బర్డ్‌ఫ్లూ అనే వైరస్ వల్ల మనుషులకు పెద్దగా ఇబ్బందులు ఉండవని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. మండలంలోని కాతేరు పరిధిలో మల్లయ్యపేట సెంటరు వద్ద వెన్ కబ్ చికెన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఎగ్, చికెన్ ఉచిత స్నాక్స్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చికెన్ తినాలనుకొనే వారు డబ్ల్యూహెచ్‌వో ఆదేశాల ప్రకారం 70డిగ్రీలు ఉడికిస్తే చాలని, కాని ప్రతి ఒక్కరూ 90 డిగ్రీల పైబడే ఉడి కిస్తారని తద్వారా బర్డ్‌ఫ్లూ వైరస్ చనిపోతుందన్నారు. ఈ సందర్భంగా చికెన్ ఫ్రై, ఉడికించిన గుడ్లను స్థానికులకు అందించారు. కార్యక్రమంలో గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, బిక్కిన సాంబశివరావు, వేముల చిన్న, స్వామి పాల్గొన్నారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

పార్టీ నూతన మండల కమిటీ అధ్యక్షుల పరిచయ కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఏయే పథకాల వల్ల ఏయే వర్గాలకు లబ్ధి చేకూరుతుందో వివరించాలని పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీని పటిష్టం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మండలాధ్యక్షుల బాధ్యతలను వివరించారు. సంఘటనా మంత్రి మధుకర్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, హారిక, రొంగల గోపి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడతానని పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోగల వివిధ విభాగాల అధిపతులు, ప్రిన్సిపాల్స్‌ను సోమవారం కలసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా మహిళా సంఘం, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఆహుతవుతున్న హోటల్. పక్క చిత్రంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తినష్టం

అనపర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని దేవీచౌక్ సెంటర్‌లో ఉన్న జ్యోతి హోటల్‌లో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక గదిలో స్టౌ వెలిగించే క్రమంలో సిలెండర్ నుంచి మంటలు వ్యాపించాయి. ఒక్క సారిగా హోటల్ మొత్తాన్ని చుట్టుముట్టడంతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. హోటల్ లో గ్యాస్ సిలెండర్లు ఉండటంతో పరిసర దుకాణదారులు ఆందోళన పడ్డారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సిబ్బంది ప్రమాదానికి కారణమైన గ్యాస్ సిలెండర్‌తో పాటు మిగిలిన సిలెండర్లను బయటకు తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ఫైర్ అధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

'పేరాబత్తుల విజయానికి కృషి చేయండి'


ఓటు అభ్యర్థిస్తున్న రామకృష్ణ, గోవింద్ తదితరులు

రంగంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ఓటర్లంతా సహకరించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు చింతల రామకృష్ణ అన్నారు. సోమవారం వడిశలేరులో ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో అనపర్తి నియోజకవర్గ, రంగంపేట మండల, వడిశలేరు గ్రామ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అష్టాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ దృశ్యం

సీతానగరంలో అష్టాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

సీతానగరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీతానగరం ఏటిగట్టు వద్ద హనుమాన్ ఆలయానికి ఎదురుగా ఉన్న మహామృత్యుంజయ సప్తరుషి సమేత శివాలయం వద్ద సోమవారం అష్టాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠను అర్చకులు యనమండ్ర సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు జ్యోతిర్లింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ధ్యాన సాధనకు సమయం కేటాయించాలి

రంగంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ప్రశాంతతకు కొంత సమయం కేటాయించాలని శ్రీకృష్ణపట్నం హార్ట్‌పుల్‌నెస్ కేంద్ర ప్రచారక్ ఈ.రాంబాబు సూచించారు. సోమవారం మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారధుల ఆధ్వర్యంలో ఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జ్ఞానజ్యోతి ఐదవరోజు శిక్షణలో భాగంగా ఆయన అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఐసీడీఎస్ పీవో జెస్సీఫ్లోరెన్స్, డీఆర్‌పీలు ఎన్‌వీ రమణాంజలి, వి.త్రిమూర్తులు పలు అంశాలపై మాట్లాడారు.

8న జరిగే లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

అనపర్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ తెలిపారు. సోమవారం అనపర్తిలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు పరిధిలో ఉన్న సివిల్ కేసులు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

అనపర్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ప్రశాంతత కోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని ఐఈ కోఆర్డినేటర్ కనకబాబు అన్నారు. అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి ఐదోరోజు శిక్షణలో భాగంగా ఆయన పలు అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బాల్యం నుంచే సాధన వైపు దృష్టి మళ్లించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఎమ్ఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.


జ్ఞానజ్యోతి శిక్షణలో పాల్గొన్న ఎంఈవో సత్తిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు

త్రిముఖలింగేశ్వరస్వామి కల్యాణం

బిక్కవోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతలమామిడి వద్ద వున్న త్రిముఖ లింగేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన సత్తి నాగిరెడ్డి, సుశీల దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించగా అర్చకులు రమణశర్మ నేతృత్వంలో అర్చక బృందం కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.


రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణాలు

సీతానగరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కొడమంచిలి రాము ఆధ్వర్యంలో ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ముగ్గళ్ళ ఉమా కొమరేశ్వర స్వామి ఆలయం, మునికూడలిలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయంతో పాటు కాటవరం, కూనవరం తదితర గ్రామాల్లోని ఆయా శివాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.


దివ్యాంగ బాలుడి వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

ముగిసిన దివ్యాంగుల సర్వే

రంగంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 11 నుంచి 24 వరకు దివ్యాంగుల యోగక్షేమాలపై 14 మంది టీమ్ సభ్యులు సర్వే నిర్వహించాయని న్యాయవాది మడికి రాంబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ముకుందవరంలో దివ్యాంగుల సర్వే నిర్వహించి నలుగురు దివ్యాంగులను గుర్తించామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించి మొత్తం 104 మంది దివ్యాంగులను గుర్తించి పలు వివరాలు సేకరించామన్నారు. సర్వేలో సేకరించిన వివరాలను కోర్టుకికి అందిస్తామన్నారు. సర్వేకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఎల్‌వీ నూతలపాటి అప్పల కొండ, డి.విజయ, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ కం రైలు బ్రిడ్జిపై
కారు బీభత్సం 8
- రెండు బైక్‌లను ఢీకొన్న కారు..
- బ్రిడ్జి పైనుంచి పడి ఒకరి మృతి



పట్టభద్రమేనా!

నేటితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారానికి తెర

- ఎల్లుండే పోలింగ్
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- కూటమి శ్రేణులు ప్రచారం
- పేరాబత్తులకే అవకాశాలు
- బరిలో 35 మంది అభ్యర్థులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సమయం దగ్గరపడింది. మరో రెండు రోజుల్లోనే ఎన్నిక నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. పోలింగ్‌కు 48 గంటల్లోనే ప్రచారం ముగించాలనేది ఎన్నికల సంఘం నియమావళి. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్లు లెక్కిస్తారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,13,126 ఓట్లు ఉన్నాయి. బరిలో 35 మంది పోటీ పడుతున్నారు. ఈ నెల 27న జరగనున్న పోలింగ్‌లో 35 మంది ఉన్నారు. ఇందులో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్..పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులుకు మధ్య ప్రధాన పోటీ ఉండొచ్చేన వాదన ఉంది. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుమారుడు జీవీ సుందర్ కొన్ని ఓట్లు చీల్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ స్థానాన్ని గెలిపించుకోవాలనే లక్ష్యంతో అధికార కూటమి ఉంది. అధికారులు ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు.పోలింగ్ బ్యాలెట్ పత్రాలతో జరుగుతోంది. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ పత్రాల బాక్సులను. ఇతర ముఖ్య సామగ్రిని ఏలూరులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు.3వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. బ్యాలెట్ పత్రాల్లో మొదటి,రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి ఉన్నందున్న ఫలితం ఆలస్యమవుతుంది.

కూటమిలో గెలుపు ధీమా

కూటమిలో తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుస్తారనే ధీమా ఏర్పడింది. ఆయనను గెలిపించడానికి జిల్లాలోని కూటమి మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎంపీలతో పాటు మొత్తం కేడరంతా పనిచేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికలు చాలా కీలకం అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.జిల్లా మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,టీడీపీ నేతలు బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన రాజమండ్రి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, జిల్లాలోని కూటమి క్యాడర్ ఒక్కలెక్కన పని చేస్తున్నారు.అధికార కూటమి అంతా ఒకే తాటిపై ఉండడంతో పేరాబత్తుల బలం పెరిగింది.దిడ్ల రాఘవులకు టీచర్ సంఘాలు ఉండడంతో పోటీ ఇవ్వగలుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందరూ మొదటి ప్రాధాన్యతా ఓటు కోసమే ప్రయత్నిస్తున్నారు.

బరిలో 35 మంది..

బరిలో 35 మంది అభ్యర్థులు ఉన్నారు. కాకినాడకు చెందిన పేరాబత్తుల రాజశేఖర్, కపిలేశ్వరపురం మండలం పడమర కండ్రికకు చెందిన దిడ్ల వీరరాఘవులు, కాట్రు నాగబాబు, షేక్ హేస్సేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం,కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమకుమారి, కైల లావణ్య, కొల్లు గౌతమ్‌బాబు, చిక్కాల దుర్గారావు,తాళ్లూరి రమేష్, నోరి దత్తాత్రేయ,యాళ్ల దొరబాబు,నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ,పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మన బోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నీరాజ్, బండారు రామమోహనరావు,చిక్క భీమేశ్వరరావు,మాకే దేవీవరప్రసాద్,మెర్ల శాస్త్రులు, మోకన అంబేద్కర్,రాజ పూడి, జేటీ రామారావు,రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివ గణేష్,విష్ణువఝుల శ్రీనివాస్, ఎం.శ్రీనివాస రావు, జీవీ.సుందర్,హాసన్ షరీఫ్ పోటీలో ఉన్నారు.



నిన్నటి వరకూ ఒక లెక్క..!

నిన్నటి వరకూ ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క అంటున్నారు.. నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ.. ఎందుకంటే ఎన్నో కష్టాల మధ్య చదువుకుని ఈ స్థాయికి ఎదిగారు.. పేద విద్యార్థులు కష్టాలు ఎలా ఉంటాయో ఆమెకు తెలియదా..వర్శిటీ హాస్టళ్లలో సరైన భోజనం ఉండదు.. కనీస సౌకర్యాలు ఉండవు.. నన్నయ వర్శిటీ లో ఇవీ మరీ ఎక్కువ.. గతంలో ఈ విషయం చాలా సార్లు రుజువైంది కూడా.. వర్శిటీ హాస్టల్‌లో పెట్టే ఆహారం బాగోవడం లేదని విద్యార్థులు ఆందోళనలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.. దీనిపై అవగాహన ఉందో ఏమోకానీ.. వీసీ సోమవారం విద్యార్థులు.. విద్యార్థినుల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.. మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.. ఒక విద్యార్థినికి భోజనం తినిపించారు.. భోజనం బాగోలేక పోతే నాకు చెప్పండి అంటూ ధైర్యమిచ్చారు.. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా.. పుస్తకాలకు దగ్గరగా జీవించాలని సూచించారు.



ఊహల పల్లకీలో.. ఊరేగించనా!?

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎవరికో..

- ఎన్నిక షెడ్యూల్ జారీ
- మార్చి 20న పోలింగ్.. ఫలితాలు
- ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ
- 29 వరకూ ఎమ్మెల్సీగా యనమల
- మళ్లీ పొడిగింపు లేనట్లే?
- జిల్లా నుంచి ఎవరికి దక్కేనో
- ముందువరుసలో వర్మ
- పవన్ కోసం సీటు త్యాగం
- తొలి ఎమ్మెల్సీకి బాబు హామీ
- జనసేన నుంచి నాగబాబు
- ఆశావహుల ప్రయత్నాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే నెల్లో ముగియనుండడంతో ఈ స్థానాలకు కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా సోమవారం షెడ్యూల్ జారీ అయింది. ఎమ్మెల్సీ పదవి కోసం అప్పుడే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆశావహుల సందడి పెరిగింది. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతలు తెర వెనుక ప్రయత్నాలు ఆరంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ముగుస్తుండడంతో ఆయనకు పొడిగింపు ఛాన్స్ లేనట్లేనని పార్టీ ఇదివరకే సంకేతాలు పంపింది. దీంతో ఉమ్మడి జిల్లా కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన నుంచి నాగబాబుకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెడతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎవరిని వరిస్తాయో చూడాల్సిందే మరి.

యనమలకు ఛాన్స్ లేనట్లే..

తుని నుంచి మాజీ మంత్రి యనమల ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో ఈయనకు మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరిగింది. కానీ ఈసారి ప్రభుత్వంలో యువ నేతలకు ఛాన్స్ ఇవ్వాలన్న టీడీపీ సిద్ధాంతం నేపథ్యంలో సీనియర్ అయిన యనమలకు అమాత్య పదవి దూరమైంది. అయితే ఎమ్మెల్సీ పదవి ఎలాగూ ఉండడంతో పెద్దగా యనమలకు ఇబ్బంది రాలేదు. పైగా ఎన్నికల్లో యనమల కుటుంబానికి ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ సీట్లు పార్టీ కట్టబెట్టింది. దీంతో ఇప్పుడు యనమల తనయురాలు దివ్య తుని ఎమ్మెల్యేగా, అల్లుడు ఏలూరు ఎంపీగా ఉన్నారు. వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇలా యనమలతో కలిపి ఆయన కుటుంబానికి చెందిన మొత్తం నలుగురు వివిధ పదవుల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం యనమలకు ఉన్న ఎమ్మెల్సీ పదవి మార్చి 29వ తేదీతో ముగుస్తోంది. కానీ ఆయనకు తిరిగి ఈ పదవిని మళ్లీ కొనసాగించే అవకాశం లేదని పార్టీ ఇప్పటికే సంకేతాలు పంపింది. ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఎమ్మెల్యేల బలం ప్రకారం కూటమికే దక్కనున్నాయి. వీటిలో టీడీపీ నాలుగు తీసుకుని, జనసేనకు ఒకటి కేటాయించే అవకాశం ఉంది.

నాడు పలువురి త్యాగం?

ఎన్నికల సమయంలో పిఠాపురం సీటును పవన్‌కల్యాణ్ కోసం మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగం చేశారు. బత్తుల బలరామకృష్ణ కోసం రాజానగరం సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న వాసంశెట్టి సుభాష్ కోసం రామచంద్రపురం సీటును రెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రస్తుతం మంత్రి హోదాలో ఉన్న కందుల దుర్గేష్ కోసం నిడదవోలు సీటు బూరుగుపల్లి శేషారావు త్యాగం చేశారు. వీరిలో రాజానగరం సీటు త్యాగం చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరిని రుడా చైర్మన్‌గా నియమించింది. అంతేకాకుండా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కు కేబినెట్ ర్యాంకు కట్టబెట్టింది. రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ పొలిట్ బ్యూరో హోదా ఇచ్చింది. ఇక వీరిలో మిగిలింది వర్మ, శేషారావు మాత్రమే. నాడు టిక్కెట్లు కోసం గట్టిగా ప్రయత్నించిన మరికొందరికి వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది.

ముందు వరుసలో వర్మ..

మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి ఎమ్మెల్సీ పదవుల్లో తొలి ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. యనమల స్థానంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని చంద్రబాబు ఎవరి ద్వారా భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. రేసులో పిఠాపురం వర్మ ముందువరుసలో ఉన్నట్టు సమాచారం. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా పిఠాపురం సీటును వర్మ త్యాగం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచి పోటీ చేయడంతో వర్మకు సీటు లేకుండా పోయింది. ఈనేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు అమరావతికి వర్మను పిలిపించి అధికారంలోకి రాగానే తొలి ఎమ్మెల్సీ పోస్టు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ పదవితో పాటు క్షత్రియుల కోటాలో మరింత గౌరవం కల్పిస్తానని పేర్కొన్నారు. అటు ఎన్నికల ప్రచారంలో పవన్ సైతం వర్మ లాంటి నేత చట్టసభల్లో ఉండాలని పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు వర్మకు ఎమ్మెల్సీ పదవి కట్టబెడతారనే ప్రచారం జరుగుతోంది. వర్మ సైతం తనకు ఈ దఫా పదవి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు.

నాగబాబుకు ఇస్తే..

జనసేన నుంచి నాగబాబును ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తారనే చర్చ జరిగింది. దీనికి సంబంధించి కొంతకాలం కిందట కూటమి తరపున అధికారిక ప్రకటన వచ్చింది. నాగబాబుకు ఎమ్మెల్సీ ఇస్తే వర్మకు ఛాన్స్ ఉండదనే ప్రచారం కొంతకాలం కిందట జరిగింది. ఖాళీ అయిన ఐదు స్థానాల్లో ఒకటి జనసేనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఆ కోటాలో నాగబాబు ను భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. టీడీపీ ఖాతాలో ఉండే నాలుగింటిలో ఒకటి ఉమ్మడి జిల్లా కోటాలో వర్మకు ఇస్తారని, తద్వారా ఏ సమస్యా ఉండదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

మా సంగతేంటి?

గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం ఆర్థికంగా, కేడర్ పరంగా వెన్నుదన్నుగా ఉన్నామని, ఎమ్మెల్సీ పదవితో తమను గౌరవించాలని కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొందరు టీడీపీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఐదేళ్లలో పార్టీకి ఆర్థికంగాను, కేడర్‌పరంగాను చేసిన సేవలను వివరిస్తూ త్రుటిలో సీటు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవికి పరిగణనలోకి తీసుకోవాలంటూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పార్టీ ఆశావహుల నియోజకవర్గాల్లో రహస్యంగా ఐవీఆర్ఎస్ సర్వే చేసినట్టు సమాచారం. ఆ సర్వే ప్రకారం పార్టీ ఇప్పటికే ఒక అంచనాకు వచ్చి ఉంటుందని అంటున్నారు. కోనసీమ జిల్లా నుంచి ఓ మహిళా నేత తనకున్న పలుకుబడితో ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటు కమ్మ సామాజికవర్గం నుంచి సైతం కొందరు నేతలు పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 10న నామినేషన్ దాఖలు చేయడానికి ఆఖరిరోజు కావడంతో వచ్చే నెల మొదటివారంలోనే పదవుల కేటాయింపుపై స్పష్టత రానుంది.

కదిలించిన ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- రేపే మహా శివరాత్రి
- నిన్నటి వరకూ ఏర్పాట్లు లేవ్
- ఒక్క కథనంతో కదలిక
- చకచకా సాగుతున్న ఏర్పాట్లు
- గోదావరి ఘాట్లు కళకళ
- దగ్గరుండి రేవుల ముస్తాబు
- రాజమండ్రి, కొవ్వూరు ఇంతే



రేవులు శుభ్రంగా : రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌లో మెట్లపై మట్టి తొలగింపు.. నీటిలో చెత్త తరలిస్తున్న గోదావరి పరిరక్షణ సమితి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి ఏర్పాట్లపై అధికారులు కదిలారు.. ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో చకాచకా పనులు చేస్తు న్నారు. మహా శివరాత్రికి గోదావరి రేవులను ముస్తాబు చేస్తున్నారు. గోదారమ్మ ఎక్కడ.. శివయ్యా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవా రం ప్రచురి తమైన కథనంపై అధికారులు స్పందించా రు.. ఉదయం నుంచి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గోదావరిలో నీరు తగ్గడంతో మెట్లు పైకి తేలి కనిపిస్తుండడంతో స్నానాలకు అనువుగా తయారు చేస్తున్నారు. కోటిలింగాల రేవు,పుష్కరాల రేవులకు అత్యధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నీరు బాగా కిందకు వెళ్లిన చోట్ల షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి గోదావరి రేవులకు అనుసంధానంగా ఉన్న రహదారులను ఎంపిక చేశారు.

11 ఘాట్లలో ఇలా..

రాజమహేంద్రవరంలోని 11 స్నానాల ఘాట్లలో ప్రధానంగా పుష్కరాలరేవు, కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, మార్కండేయ ఘాట్, టీటీడీ ఘాట్, శ్రద్ధానందా ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్లలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. ఈ రేవుల వద్ద ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్ట



ర్లు తో పాటు శానిటేషన్ సెక్రటరీలు, 400 మంది పారిశుధ్య కార్మికులను నియమించా రు. సిబ్బంది మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు విధు లు నిర్వహిస్తారు.ప్రతి 8 గంటలకు సిబ్బంది షిఫ్టులు మారేవిధంగా విధులు నిర్వహించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలిచ్చారు. పుష్కరాలరేవు, కోటిలింగాల రేవుల వద్ద రెండు అంబులెన్స్‌లు, ఐదు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు నగరపాలక సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. రేవులను గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. మార్కండేయ ఘాట్‌లో సోమవారం ఉదయం సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి రేవులో చెత్తను తొలగించారు.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ప్రధాన స్నానఘట్టాలపై నాచుపట్టి భక్తులు జారి పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రదాన స్నానఘట్టంలోని మెట్లపై ఉన్న నాచుని ఐరన్ బ్రష్‌తో తొలగించారు. స్నానఘట్టాల్లో భక్తులు విడిచిన బట్టలు, ఇతర వస్తువులను తొలగించి శుభ్రం చేయించారు. మెట్లపై భక్తులు జారి పడకుండా స్నానఘట్టాల్లో ఇసుక, బ్లీచింగ్ వేయించారు.



పడిపోకుండా : కొవ్వూరులో మెట్లపై నాచు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పట్టిసంకు 25 బస్సులు

కొవ్వూరు : శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టిసీమ ఉత్సవాలకు కొవ్వూరు డిపో నుంచి 25 బస్సులను నడుపుతున్నట్టు డీఎం కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 26వ తేదీ తెల్లవారుజాము 2 గంటల నుంచి 27వ తేదీ తెల్లవారుజాము వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా పట్టిసీమ వరకు టిక్కెట్ ధర రూ.60లు నిర్ణయించామన్నారు.భక్తుల రద్దీని బట్టి బస్సులు పెంచే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

సీతానగరం,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ సూచించారు. సీతానగరం మండలం వంగలపూడి నుంచి పట్టిసీమకు వెళ్లేందుకు గోదావరికి అడ్డంగా వేసిన రహదారిని సోమవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వంగలపూడి నుంచి పట్టిసీమ వెళ్లేందుకు దారి అనువుగా ఉందన్నారు.ఆయన వెంట సీఐ సత్యకిషోర్, ఎస్ఐ రామ్‌కుమార్, కార్యదర్శి సుజాత,కొంచ చం ద్రభాస్కర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



అంతా ఓకేనా : వంగలపూడి టూ పట్టిసం రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ

హామీల అమలుకు 108 ఉద్యోగుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు అధ్యక్షతన ప్రభుత్వాధికారులతో జరిగిన చర్చల్లో 108 యూనియన్ ప్రతినిధులకు రాతపూర్వకంగా, మౌఖికంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూనియన్ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి గుబ్బల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గతంలో జరిగిన చర్చల్లో ప్రభుత్వం కొన్ని డిమాండ్లు ఒప్పుకోవడంతో చర్చలు ఫలించి సమ్మె నోటీసును తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తమ డిమాండ్లను కొత్త యాజమాన్యం కోసం తయారు చేసే ఆర్ఎఫ్‌పీలో చేర్చుతామని, అవి అమలయ్యేలా చూస్తామని చెప్పడం జరిగిందన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం తయారు చేసిన ఆర్ఎఫ్‌పీలో తమకు ఇచ్చిన మినిట్స్‌లోని అంశాలు, మౌఖికంగా ఇచ్చిన హామీలు చేర్చలేదని వీటిని తక్షణమే అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు. ఈమేరకు కలెక్టర్ ప్రశాంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావులకు వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంయుక్త కార్యదర్శి రమేష్‌నాయుడు, జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.



108 ఉద్యోగుల నిరసన ప్రదర్శన

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రతి సర్వే నెంబరులో డేటా సేకరించాలి

ఏఎస్‌వో జోడాల


సమావేశానికి హాజరైన గణాంక అధికారులు

కొవ్వూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ గణనలో భాగంగా ప్రతి సర్వే నెంబరులో డేటాను క్షేత్రస్థాయిలో సేకరించి ఆన్‌లైన్ చేయాలని తాళ్లపూడి ఏఎస్‌వో జోడాల వెంకట్ తెలిపారు. జాతీయస్థాయిలో పంటల విధానం, పంటల సర్వే అనే అంశంపై సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సహాయ గణాంక అధికారులు సమావేశమయ్యారు. దేశం మొత్తం మీద జరిగే ఆన్లైన్ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్టు చెప్పారు. వ్యవసాయ గణనలో ప్రతి సర్వే నెంబర్‌కు వెళ్లి అక్కడ ఉన్న డేటాను సేకరించి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప గణాంక అధికారి సోమరాజు, సహాయ గణాంక అధికారులు నీలిమ, అనీల్, వెంకటేశ్వరరావు, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో తాగునీటికి ఇబ్బందులు

ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు


ఎస్సీ ఏరియాలో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక గ్రామంలోని ఎస్సీ ఏరియాలో తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు అధికారులు అత్యవసర ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు చెందిన బోరు పాడై పోవడం వల్ల కొత్త బోరు వేయాల్సి ఉంది. ఈ క్రమంలో నీటికి ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యహాన్, పంచాయతీ అధికారులు, స్థానిక నాయకులు సమాలోచన చేసి అక్కడి ప్రజలకు ట్యాంకుల ద్వారా ఉదయం, సాయంత్రం నీటిని సరఫరా చేస్తున్నారు. కార్యక్రమంలో యాళ్ల బాబూరావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థికి ఓటేయండి

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి


వేలివెన్నులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బూరుగుపల్లి, వేదవ్యాస్

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. సోమవారం వేలివెన్నులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి, అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్లు రాజశేఖరంనకు మొదటి ప్రాధాన్య ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఓటర్లను కలసి కరపత్రాలు అందజేశారు. శశి విద్యాసంస్థలో పనిచేసే పట్టభద్రులను కలసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకుడు దాసరి సత్యనారాయణ, బూరుగుపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమ్మ మనసును బాధ పెట్టకండి

'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్ల జోలికి పోవద్దని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణం చేయండని తాను వీసీగా కాకుండా అమ్మలా చెప్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. పిల్లలకు జరగరానిది జరిగితే తల్లి మనసు విలవిలలాడిపోతుందని, అమ్మ మనసును బాధ పెట్టవద్దని కోరారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఈసీఈ విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది మృతి చెందాడు. అతడి పేరిట శ్రీకాంత్ స్మారక వాలీబాల్ టోర్నమెంటును సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ... తాను పెద్ద కుమారుడు తేజ్‌నయన్‌ను 1989లో, చిన్న కుమారుడు సిద్ధార్థ్‌ను 2010లో పోగొట్టుకున్నానన్నారు. ఇద్దరి పిల్లలనూ దూరం చేసిన దేవుడు తనకు ఇప్పుడు ఇంతమంది పిల్లలను ఇచ్చాడన్నారు. ఒక బిడ్డను పోగొట్టుకుంటే అమ్మ మనసు ఎంత బాధపడుతుందో తనకు తెలుసునన్నారు. మీరంతా బాగా చదువుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలని కోరారు. తాను వీసీగా కాకుండా మీ అందరికీ అమ్మలాగ వచ్చానని చెప్పారు. ఏ పని చేసినా కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, అప్పుడే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.సుధాకిరణ్, బి.కృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న టెంపో

ఎనిమిది మంది స్వల్ప గాయాలు

కుంభామేళాకు వెళ్లొస్తుండగా ఘటన


అనంతపల్లి శివారులో డివైడర్‌ను ఢీకొన్న టెంపో వ్యాన్

నల్లజర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణంలో సోమవారం తెల్లవారుజామున అనంతపల్లి శివారు జాతీయ రహదారిపై డివైడర్‌ను టెంపో వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 8మందికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఎవరికి ప్రాణహాని లేదని నల్లజర్ల పోలీసులు చెప్పారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 12మంది టెంపో వ్యాన్‌లో కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 టిప్పర్లు సీజ్

నల్లజర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 టిప్పర్లను గనులు, భూగర్భ జలాల శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. సోమవారం ఉదయం మైనింగ్ శాఖ అధికారి డి.ఫణి భూషన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఎ.ప్రసాద్ అనంతపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా కుమారదేవం నుంచి నల్లజర్ల వైపు వస్తున్న 8 ఇసుక టిప్పర్లను ఆపి పత్రాలు చూపించాలని కోరడంతో వారి వద్ద ఎటువంటి పత్రాలు చూపించకుండా డ్రైవర్లు పారిపోయారు. ఇతర డ్రైవర్ల సహాయంతో 8 ఇసుక టిప్పర్లను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్టు ఫణి భూషన్‌రెడ్డి తెలిపారు. టిప్పర్‌లో ఉన్న ఇసుక విలువ రూ.1,60,000 ఉంటుందన్నారు.

మహా శివరాత్రికి పటిష్ట బందోబస్తు: ఎస్పీ

» కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో

ఏర్పాట్ల పరిశీలన


గోష్పాదక్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ తెలిపారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను సోమవారం ఆయ న పరిశీలించారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది శివరాత్రి ఉత్సవాల్లో ఏఏ ఏర్పాట్లు చేశారో, ఈ ఏడాది ఏమేమి ఏర్పాట్లు చేస్తున్నారో సీఐ పి.విశ్వంను అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు. ఏలూరు నుంచి వచ్చే వాహనాలు పెట్రోల్ బంకు వద్ద నుంచి ఏసీఆర్ లాడ్జి, మినీ బైపాస్‌లో డీఎస్పీ కార్యాలయం, రైల్వేస్టేషన్ మీదుగా కాటన్ విగ్రహం వద్దకు చేరుకుంటాయన్నారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు కాటన్ విగ్రహం నుంచి రైల్వే బైపాస్ మీదుగా డీఎస్పీ కార్యాలయం నుంచి ఏసీఆర్ లాడ్జి నుంచి పెట్రోల్ బంకు వద్ద ఏలూరు రోడ్‌లోకి వస్తాయని వివరించారు. క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాల్లో గోదావరి స్నానాలకు వచ్చే భక్తులు నదీ లోపలికి వెళ్లకుండా నాటు పడవలు, గజ ఈతగాళ్లను, సుందరేశ్వరస్వామి ఆలయం బయట, లోపల లైన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నుంచి 26వ తేదీ అర్ధరాత్రి వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ కె.జగన్మోహనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'రాజశేఖరం'ను గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో

కూటమి నాయకులు


కొవ్వూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎన్నికల పరిశీలకుడు కోటి బాలాజీ అన్నారు. సోమవారం కొవ్వూరులోని బాలికల ఉన్నత పాఠశాల, అర్బన్ బ్యాంకు, డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్ ఉండవల్లి దుర్గాప్రసాద్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటు నమూన పత్రాలు అందజేశారు. పట్టభద్రులంతా ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూనపం ప్రసాద్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస్, బూత్‌ఇన్‌చార్జిలు సతీష్, కొడమంచిలి శ్యామ్, బాలాజీ, బాలి రాము, గంగరాజు పాల్గొన్నారు.


గోపాలపురంలో ఓటు నమూన పత్రాలు అందిస్తున్న నాయకులు

ఎన్నికలకు సర్వం సిద్ధం

నిడదవోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు సంబంధించి ఎన్నికల అధికార్లు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. నిడదవోలు మండలంలోని 5 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3952 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2241 మంది, మహిళలు 1711 మంది ఉన్నారు. పెరవలి మండలంలో 3 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1926 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1107 మంది, మహిళలు 819 మంది ఉన్నారు. ఉండ్రాజవరం మండలంలోని 4 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2651 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1578 మంది, మహిళలు 1073 మంది ఉన్నారు. పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు అధికార్లు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మెరుగైన శిక్షణతో ఉత్తమ ఫలితాలు

» ఐసీడీఎస్ సీడీపీవో మమ్మి

» అంగన్‌వాడీ సిబ్బందికి

జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు


చాగల్లులో టీఎల్ఎంను ప్రదర్శిస్తున్న సిబ్బందితో సీడీపీవో మమ్మి

చాగల్లు, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అభ్యసనం పట్ల ఆసక్తిని పెంపొందించి ఉత్తమ నైపుణ్యం కలిగించేలా బోధన చేయడానికి శిక్షణ దోహదం చేస్తోందని ఐసీడీఎస్ సీడీపీవో మమ్మి అన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమానికి ఆమె విచ్చేసి చిన్నారులకు మానసిక వికాసం కలిగే విధంగా విద్య పట్ల ఆసక్తిని కలిగించే విధంగాను శిక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది తయారు చేసిన అభ్యసన ఉపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో యు.గురునాథం, సూపర్‌వైజర్లు పి.పద్మావతి, జి.శిరీష పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక జడ్పీ హైస్కూల్లో అంగన్వాడీ టీచర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంఈవో తిరుమలదాసు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణలో 5వ రోజైన సోమవారం ఈసీసీ డే నిర్వహణ, స్కూల్ రెడినెస్ మేళా, గ్రాడ్యుయేషన్ డే ఎలా నిర్వహించాలనేది డెమో చేసి చూపించినట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శశికళ, విజయశాంతి, నీరజ, మహాలక్ష్మి, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తి చేసుకుని 6వ సంవత్సరం 1వ తరగతిలోకి ప్రవేశించే చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సోమవారం నల్లజర్ల హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో చిన్నారులకు ఈ వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, హారతి, కృష్ణవేణి పాల్గొన్నారు.



దేవరపల్లిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


నల్లజర్లలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మద్యం తాగి ఆటో నడిపితే కఠిన చర్యలు

సీఐ నాగేశ్వర్‌నాయక్


సదస్సులో పాల్గొన్న ఆటో డ్రైవర్లు, మాట్లాడుతున్న సీఐ నాగేశ్వర్‌నాయక్



దేవరపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగేశ్వర్‌నాయక్ అన్నారు. స్థానిక కరుటూరి ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం ఎస్ఐ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మండలంలోని ఆటోడ్రైవర్లు, ఓనర్లకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు మత్తుపదార్థాలు, మద్యం తాగరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. ఆటో సంఘం కార్యాలయం వద్ద ఆటోస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే ఆటోలు జాగ్రత్తగా నడపాలన్నారు. మార్చి 1నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజాము వరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నిఘాలో ఒక ఆటో పెట్టాలని డ్రైవర్‌తో పాటు పోలీసులు ఉంటారన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆటో ఓనర్లు, డ్రైవర్లు సిర్రా వెంకట్రావు, మడెల్లి సత్యనారాయణ, మరపట్ల జట్టయ్య, ఎస్‌కే మీరా, తంగెళ్ల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ట్స్'లో దంత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం డెంటల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ సెమినార్ హాలులో జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ, కళాశాల మైక్రో బయాలజీ డిపార్టుమెంట్ సహకారంతో నిర్వహించిన ఈ డెంటల్ క్యాంపులో పలువురు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది దంత పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ పీ.శామ్యూల్, పీజీ ఇంటర్న్స్ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, హెచ్‌ఓడీలు డాక్టర్ అనుపమ, డాక్టర్ హరికృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షుల పరిచయ కార్యక్రమం జరిగింది. పురందేశ్వరి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీని పటిష్టం చేయాలన్నారు.

పాంచాహ్నిక దివ్య కల్యాణోత్సవాలు


గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరుడి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోష్పాదక్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు, సుందర గణేష్ ఆధ్వర్యంలో సోమవారం విఘ్నేశ్వర పూజ, త్రిశూలపూజ, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిముఖము, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిపించారు. ఆర్డీవో రాణి సుస్మిత స్వామి వారిని దర్శించుకుని, కల్యాణాన్ని తిలకించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

చాగల్లు, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరంలోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణం వేడుకగా జరిగింది. అవంతి ఫీడ్స్ జనరల్ మేనేజర్, ఆలయ ధర్మకర్తలు కోర్పు వెంకటరాజు, కైలాసనాగ హైమావతి (జ్యోతి) దంపతులు పీటలపై కూర్చుకుని కల్యాణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూ జా కార్యక్రమాలు, హోమం జరిగాయి. డాక్టర్లు ఆదిత్య విశ్వాస్, దీప్తి, గ్రామ స్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు.


విశ్వేశ్వరుడి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వెంకటరాజు దంపతులు

గోలింగేశ్వరస్వామి కల్యాణం..

నిడదవోలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పాంచాహ్నిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వర స్వామి ఆలయంలో వంశపారపర్య అర్చకుడు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకాలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ ఏర్పాట్లను ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు పర్యవేక్షించారు.


నిడదవోలులో విశేషాలంకరణలో గోలింగేశ్వరస్వామి

రేపు వ్యాపార సంస్థలకు సెలవు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారసంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున వ్యాపారులంతా తమ తమ షాపులు మూసివేయాలని ఆయన పేర్కొన్నారు.


ప్రమాదంలో మృతిచెందిన రామారావు

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కారు బీభత్సం

బ్రిడ్జి పైనుంచి పడి వృద్ధుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సోమవారం రాత్రి కొవ్వూరు వైపు నుంచి వెళ్తున్న కారు రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన కండెల్లి రామారావు(62) వంతెన పైనుంచి కింద ఉన్న రైలు పట్టాలపై పడి మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమం ఉంది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు సీఐ విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో కారులో నలుగురు యువకులు ఉన్నట్టు సమాచారం. వారు ప్రమాదం జరిగిన వెంటనే పరారయ్యారు. ప్రమాదంలో కారు రెండు బైక్‌లు నుజ్జునుజ్జయ్యాయి.ఆ సమయంలో అటుగా వస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రమాదంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.పోలీసులకు సూచనలు చేశారు.


ప్రమాదానికి కారణమైన కారు

కేంద్ర విశిష్ట సంఖ్య నమోదులో ఇబ్బందులు

కొవ్వూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు కేంద్ర విశిష్ట సంఖ్య నమోదు కాక ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నాయకుడు, రైతు కేవీకే రంగారావు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు రైతులకు సక్రమంగా అందించడానికి 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) సాంకేతిక కారణాలతో నమోదు కావడం లేదన్నారు. కొవ్వూరు, నందమూరు, దొమ్మేరు గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. ఇటీవల దొమ్మేరు విచ్చేసిన వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుకు సమస్యను వివరించామన్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రంగారావు అన్నారు.